వర్షాభావం.. రైతన్నకు నష్టం

- వర్షాలు లేక ఎండుతున్న పంటలు
- సాగుకు పెట్టిన పెట్టుబడి రాని పరిస్థితి
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్న అన్నదాతలు



ఉప్పల శివారులో గిడుస బారిన వేరుశనగపంట

అయిజ: వర్షాభావంతో రైతన్నకు తీరని నష్టం వాటిల్లుతోంది. కొన్ని రోజులుగా వర్షాలు లేకపోవడంతో వ్యయ ప్రయాసలకోర్చి సాగు చేసిన పంటలు ఎండుతున్నాయి. బోరుబావుల్లో సైతం నీటిశాతం తగ్గిపోతుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పంటసాగుకు పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. గతేడాది వాతావరణం అనుకూలించకపోవడంతో రైతులు నష్టాలపాలయ్యారు. మొక్కవోని ధైర్యంతో ఈ ఏడాది వానాకాలంలో వివిధ రకాల పంటలను సాగు చేశారు. ఆగస్టు ప్రారంభంలో 10 రోజుల పాటు ఏకధాటిగా కురిసిన వర్షాలకు పలు పంటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం 20రోజుల నుంచి వర్షాలు లేకపోవడంతో ఉన్న పంటలు ఎండిపోతున్నాయి.

పంటసాగు వివరాలు..

మండలంలో 57,637 ఎకరాలు సాగుకు అనుకూలమైన భూమి ఉండగా, 11,036 ఎకరాలు ప్రతికూలంగా ఉంది. ఈ ఏడాది వానాకాలంలో సుమారు 50వేల ఎకరాల్లో పంటలను సాగు చేశారు. జూన్‌లో కురిసిన వర్షాలకు 402 ఎకరాల్లో కంది, 832 ఎకరాల్లో ఆముదం, 8,603 ఎకరాల్లో వేరుశనగ, 20,240 ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. సుమారు 15వేల ఎకరాల్లో మిరపపంట వేశారు. మిగిలిన 5వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగుచేశారు. జూన్, జూలైలో కురిసిన మోస్తారు వర్షాలకు పంటలు చిగురు తొడిగి ఏపుగా పెరిగాయి. దీంతో పంటల్లో కలుపుతీత పనులు, ఎరువులు, పురుగు మందులు చల్లే పనులను జోరుగా చేపట్టారు. ఒక్కో ఎకరాకు సుమారు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు పెట్టుబడి పెట్టారు. అయితే 20 రోజుల నుంచి వర్షాలు కురువకపోవడంతో పంటలు ఎండుతున్నాయి. పెట్టిన పెట్టుబడి సైతం రాని పరిస్థితి నెలకొంది. వర్షాభావంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

నష్టపరిహారం చెల్లించాలి..



20 రోజులుగా వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండుతున్నాయి. ఎకరాకు సుమారు రూ.20వేల వరకు పెట్టుబడి పెట్టాం. వర్షాధారంగా పంటలు సాగు చేసిన కౌలురైతుకు ఎకరాకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు పెట్టుబడి అదనం. ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– తిరుమల్లేష్, రైతు, అయిజ

పంటనష్టాన్ని అంచనా వేయాలి..



ఈ ఏడాది వర్షాలు చాలా తక్కువగా ఉన్నాయి. వానకాలం పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బోరుబావుల్లో కూడా నీటిశాతం తగ్గింది. పంటల దిగుబడి తగ్గిపోతుంది. రైతులు అప్పులు చేసి పంటలు సాగుచేశారు. వ్యవసాయ అధికారులు పంటనష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలి.

– తిప్పన్న, రైతు, ఈడుగోనిపల్లి

నివేదిక పంపుతాం..



రైతులు సాగుచేసిన పంటలను పరిశీలిస్తున్నాం. ఏఈఓలు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి వివరాలను నమోదు చేస్తున్నారు. అదేవిధంగా వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలకు జరిగే నష్టాన్ని అంచనా వేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తే నివేదిక సిద్ధం చేసి పంపిస్తాం.

– శంకర్‌లాల్, ఏఓ

క్లుప్తంగా

గృహలక్ష్మి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొద్దు

అలంపూర్ రూరల్: మండలంలో గృహలక్ష్మి పథకానికి వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దని ఎంపీడీఓ గోవిందరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

కుటుంబ పాలనకు చరమగీతం పాడుదాం

గద్వాల అర్బన్: ఓటుతో కుటుంబ పాలనకు చరమగీతం పాడుదామని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. మేలకసోంపల్లి, ఉలిగేపల్లి, ఆరగిద్ద గ్రామాలకు చెందిన పలువురు మంగళవారం జిల్లా కేంద్రంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితిలో చేరగా, వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు తెలిపారు. బుచ్చిబాబు, లవన్న, తిమ్మప్ప, లక్ష్మన్న, ఆశన్న పాల్గొన్నారు.

పంటల పరిశీలన



అలంపూర్ రూరల్: మండలంలోని గొందిమల్ల శివారులో సాగు చేసిన పంటలను మంగళవారం ఏఓ అనిత పరిశీలించారు. ఈ సందర్భంగా పంట సస్యరక్షణ చర్యలపై రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏఓ వెంట ఏఈఓ సాయిరాం ఉన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

మానవపాడు: ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని డాక్టర్ రిజ్వానా తన్వీర్ అన్నారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 40మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, చంద్రన్న, సంధ్యారాణి పాల్గొన్నారు.

టీకాలు వేయించండి

అయిజ: పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి కోరారు. మంగళవారం మండలంలోని కేశవరం, బింగుదొడ్డి గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. సెప్టెంబర్ ఒకటో తేదీ వరకు టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతోందని, పశువుల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

అయిజ: గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని టీడీపీ నాయకుడు సుధాకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఇంటి నిర్మాణానికి రూ.6లక్షలు ఇవ్వాలని, నిరుద్యోగ భృతి రూ.3,016 చెల్లించాలని, పంటల బీమాను ప్రవేశపెట్టి ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆర్డీఎస్‌కు నీళ్లివ్వండి

మానవపాడు: ఆర్డీఎస్‌కు నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు. కొన్ని రోజులుగా వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని మండలంలోని డీ–29, 30 కాల్వలకు నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సర్పంచ్‌కు వినతి



రాజోళి: గ్రామపంచాయతీ కార్మికుల వేతనాల పెంపు జీవోను అమలు చేయాలని కేవీపీఎస్ నాయకుడు విజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వెంకటేశ్వరమ్మకు వినతిపత్రం అందజేశారు. నిత్యావసర సరకుల ధరలు పెరగడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వేతనాల పెంపు జీవోను అమలు చేసి కార్మికులకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోపాల్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల చించివేతపై ఫిర్యాదు

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ గద్వాల కోఆర్డినేటర్ విజయ్‌కుమార్ మంగళవారం సీఐ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం పలు కూడళ్లలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయగా.. కొందరు ఓర్వలేక చించివేశారని, బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

తెలుగుభాషను కాపాడుకుందాం



శాంతినగర్‌లో మాట్లాడుతున్న అరుణాబాయి

శాంతినగర్: తెలుగుభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అధ్యాపకురాలు అరుణాబాయి అన్నారు. గిడుగు వెంకటరామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన తెలుగుభాష ప్రాచీనమైనదని తెలిపారు. మాతృభాష అంతరించిపోకుండా నేటి తరం ఉత్తర ప్రత్యుత్తరాలను తెలుగులోనే సాగించాలని ఆకాంక్షించారు. అనంతరం కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఆమెను శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ చంద్రమోహన్, కోఆర్డినేటర్ శివనారాయణ, అధ్యాపకులు ఏడుకొండలు, విష్ణుమోహన్‌రెడ్డి, జీవజయరాజు, వెంకటేష్, రాఘవేంద్ర, లక్ష్మీనారాయణ, బీసన్న, మహేష్, రాజేష్ కుమార్, జితేంద్రబాబు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి సరస్వతి పాఠశాలలో తెలుగుభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల కరస్పాండెంట్ గోవర్ధన్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ వెంకటేశ్వర్‌రావు, సంధ్య, నందిని పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో పూజలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీరాములు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వారికి ఆలయ నిర్వాహకుడు అరవిందరావు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు మధుసూదనాచారి, రవిచారి, చంద్రశేఖర్‌రావు, బాబూరావు పాల్గొన్నారు.

'ప్రిన్స్' సేవలు అభినందనీయం



గద్వాల అర్బన్: ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఉపాధి కల్పనశాఖ జిల్లా అధికారిణి ప్రియాంక అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో నిర్వహించిన ప్రిన్స్ సంస్థ వార్షికోత్సవానికి ఆమె హాజరై మాట్లాడారు. యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని సూచించారు. అనంతరం సంస్థ అధ్యక్షుడు గిరిబాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డీసీపీఓ నర్సింహ, సీడబ్ల్యూసీ మెంబర్ జయభారతి, న్యాయవాది వరలక్ష్మి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



గద్వాల రూరల్: జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, కాంగ్రెస్ పార్టీ నాయకుడు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గద్వాల, మల్దకల్ మండలాల బీజేపీ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి తమ అనుచరులతో కలిసి మంగళవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అదేవిధంగా విశ్రాంత ఎంఈఓ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, ఎంపీటీసీలు శివారెడ్డి, ఈశ్వర్, మాజీ ఎంపీపీ గోవిందు, సర్పంచ్ సునీత, వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ప్రలోభాలతో పార్టీ మార్పు



గద్వాల రూరల్: ఇతర పార్టీల నాయకులకు డబ్బులు, పదవులు ఆశచూపుతూ కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకుంటున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గద్దం కృష్ణారెడ్డి ఆరోపించారు. మంగళవారం డీకే బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ బూత్ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు బలోపేతంగా ఉందన్నారు. కొందరు నాయకులు డబ్బులు, పదవులకు ఆశపడి పార్టీ మారినంత మాత్రాన బీజేపీకి ఎలాంటి నష్టం లేదన్నారు. అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, వెంకటేశ్వర్‌రెడ్డి, రాముడు, నర్సింహ తదితరులు ఉన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనపై నిర్లక్ష్యం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: దివ్యాంగులకు మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఎంజీ కృష్ణ అన్నారు. సెప్టెంబర్ 6న అయిజలో నిర్వహించనున్న దివ్యాంగుల భరోసా సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మంగళవారం ఎర్రవల్లి చౌరస్తాలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు తెలంగాణలో దివ్యాంగుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. దీన్ని రూపుమాపేందుకు బహుజనులందరూ ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సెప్టెంబర్ 6న అయిజ ఠాగూర్ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించే సభకు దివ్యాంగులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపేందర్, రవి, మధు, బీసన్న, విజయ్, వెంకటేష్, నవీన్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

గట్టు: మండలంలోని ఆలూరుకు చెందిన దొడ్డి కరెప్ప(60) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ విజయ్‌కుమార్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హన్మంతు, సర్పంచ్ మల్లమ్మ, ఎంపీటీసీ ఆనంద్‌గౌడు, బీఆర్‌ఎస్ నాయకుడు రాముశెట్టి, మేస్త్రీ తిమ్మప్ప మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అభ్యాసన సామర్థ్యాలు పెంచాలి



అలంపూర్ రూరల్: విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఉన్నతి కోర్సు డైరెక్టర్ రాజు సూచించారు. పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో మంగళవారం 6నుంచి 9 తరగతుల గణితం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, సాంఘికశాస్త్రం ఉపాధ్యాయులకు ఉన్నతి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న శిక్షణకు అలంపూర్, మానవపాడు, వడ్డేపల్లి, ఉండవెల్లి, రాజోళి, ఇటిక్యాల మండలాల ఉపాధ్యాయులు హాజరవుతున్నట్లు తెలిపారు. సబ్జెక్ట్ ఇన్‌చార్జ్‌లు అశోక్‌కుమార్, రామకృష్ణ, అమీర్‌బాషా, శివప్రసాద్ పాల్గొన్నారు.

స్వార్థ రాజకీయాల కోసం అసత్య ఆరోపణలు



అలంపూర్: కొందరు నాయకులు స్వార్థ రాజకీయాల కోసం ఎమ్మెల్యే అబ్రహంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. ఎమ్మెల్యేకు మద్దతుగా మంగళవారం క్యాతూర్ నుంచి అలంపూర్ చౌరస్తా వర కు ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ లలితమ్మ, ఉపసర్పంచ్ బాలే సాహెబ్, చంద్రశేఖర్‌రెడ్డి, నరేందర్ పాల్గొన్నారు.

శాంతినగర్: ఎమ్మెల్యే అబ్రహంకు మద్దతుగా ఉంటామని వడ్డేపల్లి, రాజోళి మండలాల ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు స్పష్టం చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెడ్పీటీసీలు కాశపోగు రాజు, సుగుణమ్మ, ఆర్డీఎస్ మాజీ చైర్మన్ సీతారామిరెడ్డి మాట్లాడారు. ప్రజల్లో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్న ఎమ్మెల్యేకు అందరూ సహకరించాలని కోరారు. ఎంపీపీ రజిత, వైస్‌ఎంపీపీ రేణుక, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రఘునందన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు మాణిక్యం, రవి, నిషాక్, రవిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

పార్టీకి కాదు.. అభ్యర్థికి వ్యతిరేకం



అలంపూర్: తాము బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకం కాదని.. ఎమ్మెల్యే అభ్యర్థికి మాత్రమే వ్యతిరేకమని ఆ పార్టీ నాయకులు అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ఉండవెల్లి, మానవపాడు మండలాలకు చెందిన నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ అశోక్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, గజేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు కిశోర్, రవిప్రకాష్, వరన్నగౌడ్, సత్యారెడ్డి మాట్లాడారు. అలంపూర్ అభ్యర్థిపై పునరాలోచన చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలు కాకుండా ఎమ్మెల్యేగా ఈ నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలన్నారు. కమీషన్ల కోసం కాకుండా ఎవరికీ ఏ ఆపద వచ్చినా ఆదుకునే నాయకుడు కావాలన్నారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి నాయకత్వంలో పని చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. శివరాముడు, మద్దిలేటి, రవి, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, శేషిరెడ్డి, రాజు, సుంకన్న, ఆంజనేయులుగౌడ్, ఆత్మలింగారెడ్డి తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

అలంపూర్ రూరల్: మండలంలోని కాశీపూర్‌కు చెందిన పింజరి షాలుబాషాను మంగళవారం తహసీల్దార్ మంజుల ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా హత్య కేసులో నిందితుడైన అతడిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట



పులికల్‌లో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అయిజ: ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేసి అనేక పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మండలంలోని పులికల్‌లో మంగళవారం రూ.10లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఇటీవల మృతి చెందిన దేవన్న కుటుంబసభ్యులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.3లక్షల చెక్కును అందజేశారు. అనంతరం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ ముఖ్యకార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అదేవిధంగా మండలంలోని దేవబండను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

అలంపూర్: ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. నియోజకవర్గంలోని ఆశ కార్యకర్తలు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ కార్యకర్తల సమస్యలను సీఎం కేసీఆర్, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చెన్నమ్మ, రేణుక, యశోదమ్మ, మమత తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల సమాచారం ఇవ్వండి



మాట్లాడుతున్న తహసీల్దార్ మంజుల

అలంపూర్: మండలంలోని పోలింగ్ కేంద్రాల సమగ్ర సమాచారం ఇవ్వాలని తహసీల్దార్ మంజుల కోరారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెక్టోరియల్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల స్థితిగతులను పరిశీలించాలని తెలిపారు. కేంద్రాల్లో కల్పించాల్సిన వసతులపై నివేదిక ఇవ్వాలని కోరారు. సమావేశంలో సెక్టోరియల్ అధికారి అనిత, ఎస్‌ఐ రమేష్ తదితరులు ఉన్నారు.

హామీల అమలులో కేంద్రం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్

గద్వాల అర్బన్: కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వీవీ నర్సింహ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. విద్యుత్ సవరణ చట్టం రద్దు చేయాలని, రైతుల రుణాలను మాఫీ చేయాలని, కౌలు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై సెప్టెంబర్ 4న సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో జిల్లాస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆశన్న, ఖాజా, ఖాసీం, శ్రీనివాసులు ఉన్నారు.

మున్నూరుకాపు సంఘం నాయకుల అరెస్ట్



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: ప్రగతి భవన్ ముట్టడి చేపట్టిన మున్నూరుకాపు సంఘం నాయకులను మంగళవారం స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌కు బయల్దేరిన నాయకులను ఎర్రవల్లి చౌరస్తాలో అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో నర్సింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, పరశ, బాలకృష్ణ, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో వరుణయాగం



పెద్దఆముదాలపాడులో..



అయిజలో మారెమ్మ ఉత్సవ విగ్రహ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

మానవపాడు: మండలంలోని పెద్దఆముదాలపాడు భ్రమరాంబికాదేవి సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం వరుణయాగం, రుద్రహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణా, తుంగభద్ర నదుల నుంచి నీటిని తీసుకొచ్చి అభిషేకాలు చేశారు. మల్లికార్జునశాస్త్రి, శివకుమార్, అడవిస్వామి, నారాయణస్వామి పాల్గొన్నారు.

అయిజ: వర్షాలు కురిసి, పాడిపంటలు పండాలని కాంక్షిస్తూ మండల కేంద్రంలో గ్రామదేవత మారెమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. కొత్త చెక్కతో వజ్రంగి తయారు చేసిన మారెమ్మ ఉత్సవ విగ్రహంతో భాజాభజంత్రీల మధ్య ఊరేగింపు నిర్వహించారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



ఉండవెల్లిలో క్రీడాకారుల విన్యాసం



మానవపాడులో..

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎర్రవల్లి సరస్వతి, ఏకశిల పాఠశాలల్లో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

ఉండవెల్లి: మండలంలోని పలు పాఠశాలల్లో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

మానవపాడు: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఎస్‌ఓ అనురాధ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

లారీ, ట్యాంకర్ ఢీ

పెబ్బేరు రూరల్: లారీ, వాటర్ ట్యాంకర్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని రంగాపూర్ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. రహదారి పక్కన మొక్కలకు నీళ్లు పడుతున్న ట్యాంకర్‌ను కర్నూల్‌వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో లారీ డ్రైవర్ చాంద్‌పాషాతోపాటు మొక్కలకు నీళ్లు పడుతున్న బాలయ్యకు గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జగదీశ్ తెలిపారు.